క్లుప్తంగా

ఘనంగా సుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

చందుర్తి: మండలంలోని బండపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం సుదర్శన హోమ పూజలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు శ్రీకాంతాచార్యుల మంత్రోచ్ఛరణ మధ్య హోమం పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండ లక్ష్మన్ గౌడ్ సత్తవ్వ దంపతులు, గౌరవ అధ్యక్షుడు లచ్చిరెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు కొదంగుల్లా శ్రీకాంతాచార్యులు, ఆలయ చైర్మన్ కొండా లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంతాచార్యులు కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

తంగళ్లపల్లి: మండలంలోని రామచంద్రాపూర్ రైతులు గురువారం సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాచారం బానప్ప చెరువు నిండడంతో ఆయకట్టు కింద ఉన్న తమ గ్రామంలోని పొలాలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కాముని దహనం



ముస్తాబాద్‌లో కాముని దహనం

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట: ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేటలో కామదహన వేడుకలు గురువారం నిర్వహించారు. ముస్తాబాద్‌లోని శ్రీ శివకేశవుల ఆలయ పరిసరాల్లో కాముని దహనం చేశారు. అర్చకులు హరీశ్‌శర్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఎల ఎసాని దేవయ్య, రాజు, బాలయ్య, రాజేందర్, బిక్షపతి, నర్సింలు, మల్లయ్య, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా డోలోత్సవం



వేములవాడ: రాజన్న సన్నిధిలో త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం డోలోత్సవం నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



నర్సింగాపూర్ పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన వంటకాలు

చందుర్తి : మండలంలోని సనుగుల, చందుర్తి ప్రాథమిక పాఠశాలల్లో, నర్సింగాపూర్ ఉన్నత పాఠశాలల్లో ఫుడ్‌ఫెస్టివల్ వేడుకలు గురువారం ఆకట్టుకున్నాయి. విద్యార్థులు పలు రకాల వంటకాలను వండి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. మూడపల్లి ఉన్నతపాఠశాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, ఎంఈవో వినయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు కట్కూరి ముఖేశ్, సుజాత, బాలకిషన్, జితేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియామకం

తంగళ్లపల్లి: మండలకేంద్రానికి చెందిన బీజేపీ మహిళా నాయకురాలు అసాని లావణ్య రెడ్డి గురువారం బీజేపీ మహిళా మోర్చ జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు పలం అన్నపూర్ణ లావణ్య రెడ్డికి నియామకపత్రం అందించారు. బీజేపీ మహిళా మోర్చ నాయకురాళ్లు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

వీర్నపల్లి: మండలంలోని భూక్యతండా, బాపురావుతండాలలో గురువారం సీఐ శ్రీనివాస్, ఎస్సై ఎల్లయ్యగౌడ్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. ఆరు ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. 950 లీటర్ల బెల్లం పానకం, 25 కిలోల బెల్లం, 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.



కంచర్లలో నిరుపయోగంగా నీటి తొట్టి



వీర్నపల్లి మండలకేంద్రంలో..

మూగజీవాల దాహార్తి తీరేదెలా?

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ఉపాధి హామీ పథకంలో నిర్మించిన నీటి తొట్లు నీరు లేక నిరుపయోగంగా మారాయి. మండలంలోని గ్రామశివార్లు, ప్రధాన రహదారుల వెంబడి నీటి వనరులు ఉన్న చోట వీటిని నిర్మించారు. మొదట్లో వీటి నిర్వహణను గ్రామ పంచాయతీ వారు చూసేవారు. తర్వాత విస్మరించడంతో నిరుపయోగంగా మారాయి. అధికారులు పశువుల నీటి తొట్లపై దృష్టిసారించి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు, తదితరులు కోరుతున్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కోనరావుపేట: మండలంలోని కనగర్తి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఇటీవల జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు రావులపెల్లి గంగారెడ్డి, భూంరెడ్డి నోట్ బుక్స్, పెన్నులు అందించి, ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్‌ను సన్మానించారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించేందుకు వుప్పుల రాజేందర్ 5 టేబుళ్లను పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వినోద్‌కుమార్, నర్సయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్ భూంరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ అనుపాటి బాపురెడ్డి, డెయిరీ చైర్మన్ లక్ష్మారెడ్డి, నర్సయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై దుష్ప్రచారం మానుకోవాలి



మాట్లాడుతున్న చక్రధర్‌రెడ్డి

ముస్తాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల కో కన్వీనర్ కనమేని చక్రాధర్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుల రూ.2లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగులకు 55వేల ఉద్యోగాలు ఇచ్చారన్నారు. సిరిసిల్లకు గోదావరి నీరు తెచ్చిన కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు చెబుతుంటే, ఓర్వలేని బీఆర్‌ఎస్ నేతలు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కిషన్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, నర్సింలు, వేణు, శ్రీకాంత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మరో రెండు గ్రామపంచాయతీలు

ఎల్లారెడ్డిపేట: మండలంలో నూతనంగా రాచర్ల బాకురుపల్లి, సేవాలాల్‌తండా గ్రామపంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశించినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తెలిపారు. మండలకేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో 24 గ్రామపంచాయతీలు ఉండగా అదనంగా మరో రెండు జీపీల ఏర్పాటుకు ప్రభుత్వ సిఫారసును గవర్నర్ ఆమోదించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ కోడ్ ముగియగానే గ్రామపంచాయతీల ఏర్పాటుకు జిల్లా పంచాయతీరాజ్ అధికారి ద్వారా ఆదేశాలు వచ్చినట్లు పేర్కొన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు బాల్‌రెడ్డి ఉన్నారు

ఘనంగా వసంతోత్సవం



పూజలు చేస్తున్న అర్చకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో శ్రీరాజరాజేశ్వరస్వామి దత్తత శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో గురువారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేణుగోపాలచారి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊయలలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మోతె లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచులు దొమ్మాటి నర్సయ్య, నిమ్మ లక్ష్మనారాయణరెడ్డి, నర్సయ్య, హన్మాండ్లు, సుధాకర్ రెడ్డి, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలకు శిక్షణ



బోయినపల్లి: మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మానవ అక్రమ రవాణ అనే అంశంపై మండలంలోని పలుగ్రామాల వీవో అధ్యక్షులు, వీఓఏలకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పిల్లల అపహరణ, యువతులను ప్రలోభాలకు గురి చేసి వేశ్యగృహాలకు విక్రయించడం, సైబర్ మోసాలకు పాల్పడడం తదితర అంశాలపై శిక్షణలో వివరించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం జయసుధ, మహిళా సంఘాల వీఓలు, వీఓఏలు తదితరులు ఉన్నారు.

చెత్తను తొలగించిన సిబ్బంది



సాక్షి స్పందన

సిరిసిల్ల: పట్టణంలోని బీవైనగర్ 34వ వార్డులో చెత్త పేరుకుపోవడంతో 'సాక్షి'లో గురువారం 'చెత్తపై చిత్తశుద్ధి ఏదీ' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య స్పందించారు. ఈ మేరకు బీవైనగర్‌లోని కార్మికవాడల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను పంపించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను మున్సిపాల్ పారిశుధ్య సిబ్బంది తొలగించారు.

రాజన్నను దర్శించుకున్న ఎస్పీ



పూజలు చేస్తున్న ఎస్పీ మహేశ్ బీ గీతే

వేములవాడ: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని ఎస్పీ మహేశ్ బీ గీతే గురువారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో వేదోక్త ఆశీర్వాదం చేసి లడ్డూప్రసాదం అందజేశారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీకాంతచారి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రమేశ్‌లు ఉన్నారు.

హోలీని ప్రశాంతంగా జరుపుకోవాలి

సిరిసిల్లక్రైం: జిల్లా ప్రజలు హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ మహేష్ బీ గీతే సూచించారు. పరిచయం లేని వ్యక్తులపై రంగులు చల్లడం, బలవంతంగా రంగులు చల్లినట్లు ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు.

మహిళ అదృశ్యంపై కేసు



లక్ష్మి

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన దొంతరవేని లక్ష్మి ఉరఫ్ నర్సవ్వ (47) అదృశ్యమైనట్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రామానికి లక్ష్మి బుధవారం వట్టిమల్ల వరకు బంధువుల ద్విచక్రవాహనంపై వెళ్లి వేములవాడ బస్సు ఎక్కింది. ఆతర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లక్ష్మికి భర్త రాజయ్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• తాగునీటి సరఫరా అందించాలి

సిరిసిల్లకల్చరల్: పెద్దూరు ప్రజలకు నీటి సరఫరా లేక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే తాగునీటి సరఫరా అందించాలని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ కోరారు. గురువారం కమిషనర్ సమ్మయ్యకు వినతిపత్రం అందించారు. ఇటీవలే మున్సిపల్ అధికారులు నీటి పైప్ లైన్ వేశారని, మరమ్మతుల కారణంగా సరఫరా నిలిచిపోయిందన్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేసి తాగునీరందించాలని కోరారు.

• పంటల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని పొత్తూరులోపంట పొలాలను కరీంనగర్ జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారులు గురువారం పరిశీలించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.రాజేంద్రప్రసాద్, పొత్తూరు ఏఈవో లలిత, ఆదర్శ రైతులు కరుణాకర్ రెడ్డి, మహేశ్, రవీందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

• ఆశా కార్యకర్తల నిరసన

కోనరావుపేట: మండలకేంద్రంలో ఆశా కార్యకర్తలు గురువారం నిరసన చేపట్టారు. జగిత్యాలలో ఆశా కార్యకర్తపై జరిగిన లైంగికదాడిని నిరసిస్తూ, నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ గ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలకేంద్రంలో ఆశ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. నాయకులు గీస భిక్షపతి, ఆశ వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు మంజుల, ఏర్పుల జ్యోతి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

• కంటి వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలి

ముస్తాబాద్: మండలకేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు అలెక్స్ కోరారు. వైద్య శిబిరంలో గురువారం 20 కాటరాక్టు ఆపరేషన్లను చేశామన్నారు. వారం రోజులపాటు నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. చక్రధర్ రెడ్డి, అంజన్‌రావు, సడిమెల ఎల్లం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

• కాంగ్రెస్ పాలనలో తాగు, సాగునీటికి కష్టాలు

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతుందని మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అందే సుభాష్, పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి అన్నారు. మండలకేంద్రంలో గురువారం వారు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం సాగు, తాగునీటి కష్టాలు మొదలయ్యాయన్నారు. నాయకులు సందీప్, పర్శరాములు, నర్సింలు, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

• ఎమర్జెన్సీ కేర్ వైద్యసేవలు ప్రారంభం

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో శ్రీ తిరుమల నర్సింగ్ హోమ్‌లో ఎమర్జెన్సీ కేర్ వైద్య సేవలను టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు డాక్టర్ ఎరవెల్లి చంద్రశేఖర్ రావు ప్రారంభించారు.డాక్టర్ అనురాధ, శశిప్రియ, శ్రీకాంత్, స్రవంతి, నాయకులు పాల్గొన్నారు.

• పాఠశాల సందర్శన

ఇల్లంతకుంట: పెద్దలింగాపూర్ గ్రామంలోని పీఎం శ్రీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం ఇల్లంతకుంట హైస్కూల్‌ను సందర్శించారు. కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, ఐఎఫ్‌పీ ద్వారా బోధన గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పీఎంశ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుర్రం సందీపరెడ్డి, ఇల్లంతకుంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.ప్రేమలత, ఉపాధ్యాయులు మహేశ్‌చంద్ర, రమణారెడ్డి, ప్రదీప్ రెడ్డి, మధుసూదన్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

• కాంగ్రెస్ నుంచి సస్పెండ్

ఇల్లంతకుంట: రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త అంతగిరి శ్రీనివాస్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బి.రాఘవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్తలు పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

• డీజిల్ దొంగతనంపై ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, ఎల్లారెడ్డిపేటలో ప్రధాన రహదారులపై కొంతకాలంగా గుర్తు తెలియని వ్యక్తులు పార్క్‌చేసి ఉన్న వాహనాల నుంచి డీజిల్, పెట్రోల్ దొంగలించడం పరిపాటిగా మారింది. మండలకేంద్రానికి చెందిన అల్లం లక్ష్మణ్ తన గూడ్స్ వ్యాన్‌లో బుధవారం రాత్రి రూ.13వేల విలువ చేసే డీజిల్‌ను ఫిల్లింగ్ చేసి తన దుకాణం ముందు ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రిపూట డీజిల్‌ట్యాంక్‌ను ఓపెన్ చేసి డీజిల్ ఎత్తుకెళ్లారు. ఉదయం లక్ష్మణ్ డీజిల్ దొంగలించినట్లు గుర్తించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

• సన్మానం

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గోపిని బీజేపీ నాయకులు సన్మానించారు. మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు, ఉపాధ్యక్షుడు ఇటికల రాజు, సిలివేరి ప్రశాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• కేసీఆర్‌పై ఆరోపణలు సరికాదు

ఇల్లంతకుంట: సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై ఆరోపణలు చేయడం సరికాదని జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, ఎండీ సాదుల్, కూస నరేశ్, కూనబోయిన రఘు, సత్యం, దొంతుల శంకర్, మధు, తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబాద్: మండలకేంద్రంలోని పెద్ద చెరువులోకి మురుగునీరు వచ్చి చేరడంతో పెద్ద చెరువు నీరు కలుషితం అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోని చేపలు, ఇతర జలచరాలు మృతి చెందుతున్నాయని మత్స్యకారులు పేర్కొంటున్నారు. అధికారులు చర్యలు తీసుకొని చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : రమేశ్, పంచాయతీ కార్యదర్శి, ముస్తాబాద్, సెల్‌నెంబర్: 9866964956

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

విద్యారంగానికి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ముందు భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ..ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందించారు. ఇక్కడ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గుండెల్లి కల్యాణ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జాలపల్లి మనోజ్ కుమార్, గర్ల్స్ కన్వీనర్ సంజన, జిల్లా కమిటీ సభ్యులు సాయి భరత్, శివ, రాహుల్, శ్రీధర్, సాయికుమార్, మధు, తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల దీక్ష



ఇల్లంతకుంట : రిలే దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సిరిసిల్లటౌన్: ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలయ్యే వరకు ఉద్యోగ నియామక పరీక్షల ఫలితాలు వాయిదా వేయాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు గురువారంతో నాలుగరోజుకు చేరాయి. దీక్షల్లో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్,ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: ఎస్సీ వర్గీకరణకు చట్టం వచ్చేంతవరకు ఎలాంటి పరీక్ష ఫలితాలను విడుదల చేయద్దని మండలంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ కొమ్ము రాజశేఖర్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష మూడోరోజుకు చేరుకుంది. హాజరైన ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి మాటాడారు. మండల అధ్యక్షుడు కొమ్ము రాజశేఖర్ మాదిగ, చెప్యాల రాజు, కొమ్ము రాజు, లింగంపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన దీక్ష చేపట్టారు. మండల అధ్యక్షుడు సావనపెల్లి బాలయ్య, నాయకులు మాట్ల శంకర్, మల్యాల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ఎస్సీ వర్గీకరణ చట్టం అమలుచేసేవరకు ఉద్యోగ నియామక ఫలితాలు నిలిపివేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల ఎమ్మార్పీఎస్ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రజాసంఘాల నాయకులు తీపిరెడ్డి తిరుపతిరెడ్డి దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంద రాజు, మండల అంబేడ్కర్ సంఘాల అధ్యక్షుడు భూమయ్య, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ మండల నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తర్రె శంకరయ్య, మండల ప్రధాన కార్యదర్శి లింగంపల్లి బాబు, మండల ఉపాధ్యక్షుడు ఆవునూరి రాజు, మండల ప్రచార కార్యదర్శి లింగంపల్లి శంకర్, నాయకులు తదితరులున్నారు.

సాదాసీదాగా సాధారణ సమావేశం




మాట్లాడుతున్న చైర్మన్ రాజు

వేములవాడరూరల్: వేములవాడ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం గురువారం సాదాసీదాగా జరిగింది. మూడునెలల క్రితం చైర్మన్‌గా రొండి రాజుతో పాలకవర్గాన్ని నియమించారు. రెండు సార్లు జరిగిన సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు, పనుల మంజూరు జరగకుండానే సాదాసీదాగా సాగించారు. జిల్లాలోనే గ్రేడ్–1 మార్కెట్‌గా ఉన్న వేములవాడ మార్కెట్ కమిటీ గతంలో ఆదాయంలో కూడా నంబర్‌వన్‌గా ఉండేది. అలాంటి మార్కెట్ కమిటీ రోజురోజుకూ రైతులు లేక ఆదాయం కూడా తగ్గిపోతోంది.

హద్దులు గుర్తింపు

పట్టణంలోని మార్కెట్ కమిటీని రూరల్ మండలంలోని మర్రిపల్లి గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలంలో మార్చేందుకు గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపారు. మార్కెట్ కమిటీ ఏర్పాటుకు నిధులు కూడా మంజూరయ్యాయి. కానీ స్థలం విషయంలో ఆలస్యం జరగడంతో పనులు జరగలేదు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇటీవల అధికారులతో స్థలాన్ని పరిశీలించి పనులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో భాగంగా రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించి 12 ఎకరాలు మార్కెట్ కమిటీకి కేటాయిస్తూ హద్దులు ఏర్పాటు చేశారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు తెలిపారు.

'అసత్య ఆరోపణలు చేస్తే సహించం'



తంగళ్లపల్లి: ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులు అభివృద్ధికి సలహాలు అందిస్తే బాగుంటుందని, అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు రాజు, రాజశేఖర్, బైరినేని రాము, చెన్నమనేని ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.